
# వెనక్కి నడుస్తున్నామా?

**కె. వరలక్ష్మి**



ఉదయం ఎనిమిదిన్నరైంది. కాఫీ టిఫిన్లయ్యాయి. ఒక ఛానల్లో న్యూస్ పూర్తైంది. మరో న్యూస్ ఛానల్ మార్చి అప్పుడే కొత్తగా చూస్తున్నంత ఏకాగ్రతతో టీ.వీ చూస్తున్నాడు రామారావు. భారతి కాఫీ కప్పు తెచ్చుకుని తీరిగ్గా ఆయన ఎదుట సోఫాలో చేరబడింది.

''ఎన్నిసార్లు చూసినా వార్తలు అవేకదా, ఎందుకలా మార్చి మార్చి చూసేస్తారు?'' అంది.

''రోజూ చెప్పినా నీ కర్థంకాదు. వార్తలైనా సరే ఒకో ఛానల్ వాళ్లు ఒకో కొత్త న్యూస్ ఇస్తారు. ఒకోసారేమో ఒకే న్యూస్‌ని ఒక్కొక్కళ్లు ఒకోలా ఇస్తారు. తేడా లేదూ?' అని భారతి వైపు చూడకుండానే సమాధానం చెప్పేసి మళ్లీ టీ.వీ చూడ్డంలో లీనమైపోయాడాయన.

ఉదయం న్యూస్ ఛానల్స్, సాయంకాలం లైబ్రరీ ఆయనకి మంచి నేస్తాలైపోయాయి.

''అలావెళ్లి కూరగాయలేమైనా కొనుక్కురా రాదూ! పదకొండయ్యేసరికి భోజనం అంటారు మళ్లీ'' అంది భారతి.

ఫోన్ రింగైంది.

ఆయనసలు ఫోన్ వైపైనా చూడట్లేదు. భారతి లేచి వెళ్లి తీసి ''హలో'' అంది.


.''అక్కయ్యా'' అట్నుంచి. అది అరుపు కాదు ఆక్రందన.

'రమ గొంతులా ఉందేమిటి' అనుకుంటూ ''ఎవరు'' అంది భారతి.

''నేనే అక్కయ్యా రమని. ఈయన ఇప్పుడే.. ఇప్పుడే ఈయన...'' భారతి చెయ్యి వణికింది. జారిపోబోతున్న ఫోన్‌ని రెండో చేత్తో గట్టిగా పట్టుకుంది. ''ఏమైంది రమా'' అంది కంగారుగా.

''ఈయన . . . వాకింగు చేసొచ్చి గోడకి చేరబడి కూర్చున్నారు. నేను కాఫీ చేసి తెచ్చేసరికి పక్కకి వొరిగి పడిపోయి ఉన్నారు. ఎంత పిలిచినా పలకడం లేదు..''

రాఘవకి రోజూ సముద్ర తీరంలో నడవడం అలవాటు. రామకృష్ణా బీచ్ దగ్గర స్కూటరు పార్క్ చేసి వుడా పార్కు వరకు నడిచి రావడం, కొత్తల్లో రామారావు కూడా కొన్నాళ్లు వెళ్లేడు. సింహాచలం



నుండి అంతదూరం వెళ్లలేక మానేసాడు.

''అయ్యో, రమా, భయపడకు. మేం వెంటనే బయలు దేరుతున్నాం. ఈ లోపల అక్కడికి దగ్గర్లో ఎవరైనా డాక్టరుంటే ఫోన్ చెయ్యి'' భారతి మాటల్లో కంగారు గమనించి రామారావు టీ.వీ. ఆఫ్ చేసొచ్చి భారతి పక్కన నిల్చున్నాడు. భారతికి కాళ్లు వణికి అడుగు ముందుకు పడలేదు. ఎలాగో నడిచొచ్చి సోఫాలో కూలబడింది.

''ఏమండీ, స్కూటరు తియ్యండి, మనం మీ తమ్ముడింటికి వెళ్ళాలి''

''ఏం.. ఏం.. ఏమైంది?'' రామారావు గొంతులో వణుకు.

''ఏం లేదు, కంగారు పడకండి, రాఘవకి కళ్లు తిరిగినట్టయ్యాయట. రమ కంగారు పడుతోంది. మనం వెంటనే వెళ్తే తనకి కొంచెం ధైర్యంగా ఉంటుంది'' భారతి లేచి తలుపులన్నీ గబగబా వెయ్యడం మొదలు పెట్టింది.

స్కూటరు పట్టుకున్న రామారావు చేతులు వణుకుతున్నాయి. వాళ్లున్న సింహాచలం సివారు నుంచి వెంకటేశ్వరమెట్ట కెళ్లాలి అంత దూరం ఆయన నడపగలుగుతాడా అని డౌటొచ్చింది భారతికి.

ఆ మాటే అడిగింది. ''ఫర్వాలేదులే'' అన్నాడు.

ఎప్పుడూ స్లోగా వెళ్లే మనిషి స్కూటరు స్పీడుగా పోనిస్తున్నాడు 'అది సహజమే కదా, నాకే ఇంత గాభరాగా ఉంది, సొంత తమ్ముడి గురించి ఆయనకింకెంత కంగారుగా ఉందో' అన్పించింది భారతికి.

అన్నదమ్ములిద్దరూ ఆ రోజుల్లో డిప్లొమాలు చేసి భిలాయ్ స్టీలు ప్లాంట్‌లో ఉద్యోగాల్లో చేరారు.

భారతి, రమ గోదావరి జిల్లాకి చెందినవాళ్లు.

పిల్లలు పుట్టి వాళ్లు కొంత ఎదిగేవరకు ఆంధ్రాకి వచ్చి వెళ్లినా తర్వాత ఇక అక్కడే సెటిలైనట్టయిపోయారు.

తలిదండ్రుల్ని కూడా వాళ్ళదగ్గరకి తీసుకెళ్లిపోయాక ఏ అయిదేళ్ల కోసారో తిరుపతి వచ్చినపుడు ముఖ్యమైన బంధువుల్ని చూసి వెళ్లడం, అంతే.

కాని, రామారావు రిటైరయ్యేక రాఘవ వి.ఆర్.ఎస్ తీసుకున్నాడు.

అన్నదమ్ములిద్దరూ కూడబలుక్కుని తిరిగి వాళ్లు పుట్టి పెరిగిన విశాఖపట్టణంలోనే ఇళ్లు కొన్నారు.

రాఘవ పిల్లలిద్దరూ ఇంకా చదువుల్లో ఉండడం వల్ల టౌన్ మధ్యలో ఉన్న వెంకటేశ్వర మెట్ట మీద కాస్త అందుబాటు ధరలో దొరికిన రెండు గదుల చిన్న ఇల్లు కొన్నాడు. రామారావుకి ఆ ఇరుకు, హడావుడి నచ్చక సిటీ నుంచి దూరంగా సింహాచలం కొండల మధ్య అదే రేటుకి విశాలమైన ఇల్లు, పెద్ద పెరడుతో సహా దొరికేసరికి ఇక ఏమీ ఆలోచించకుండా కొనేశాడు.

వచ్చిన కొత్తలో ఒకవారం వాళ్లిక్కడికి, ఆ తర్వాతి వారం వీళ్లక్కడికి వెళ్లి కలుసుకునే వాళ్లు. ఈ మధ్య నెలకోసారి కలుసుకుంటున్నారు.

ఎట్టకేలకు వెంకటేశ్వరమెట్ట వచ్చింది.

ఎప్పట్లాగే వాళ్లింటికెళ్లే దారిలో ఆవులు, గేదెలు కట్టేసి ఉన్నాయి. దారంతా ఇరుకిరుగ్గా ఉంది.

ఇంటిముందు స్కూటరు ఆగగానే పిల్లలిద్దరూ ముందు గదిలోంచి పరుగెత్తుకొచ్చి ''పెద్దనాన్నా'' అంటూ వాటేసుకుని బావురుమన్నారు.

''ఏమైంది.. ఏమైంది'' అంటున్న రామారావు శరీరం గజగజా వణికింది. చుట్టుపక్కల వాళ్లు ఓ పదిమంది ఆడామగా వచ్చి బైట నిల్చుని ఉన్నారు.

భారతి ఆ కంగారులో ఇంటి ముందున్న మురిక్కాలవలో పడబోయి నిలదొక్కుకుంది. వాకిట్లో ఉన్న రెండు మెట్లు ఎక్కి గడపలో కాలు పెట్టబోతున్న భారతిని చూస్తూనే రమ గోడకి చేరబడి చేష్టలుడిగినట్టు కూర్చున్నదల్లా చేతుల్తో గుండెలు బాదుకుంటూ ''అక్కా చూసేవా ఎంత పని జరిగిందో'' అని ఏడవడం మొదలు పెట్టింది.

భారతివెళ్లి రమని పొదివి పట్టుకుని పక్కన కూర్చుంది.

నేల మీద రాఘవ ప్రశాంతంగా కళ్లు మూసుకుని పడుకుని నిద్రపోతున్నట్టున్నాడు.

''ఈయమ్మ కంగారుపడ్డం చూసి వీధి చివరి డాక్టరుగార్ని వెంటనే పిల్చుకొచ్చేవండి, ఆయనొచ్చి నాడి లేదని చెప్పేదాకా ప్రేణం పోయిందనుకోలేదు'' అంటున్నాడొకాయన.

''ఏటీ, సేనా సిత్రంగా ఉన్నాది, నాను గేదికి గడ్డి పరకలేస్తుంటే ఈ బాబు స్కూతరక్కడాపి తెల్లటి బూట్లేసుకోని నా ముందు నించి నడిసొచ్చినాడు కాదా, ఇంతలో ఇంత గోరవైపోనాదేటి?'' అంటోంది లావుగా ఉండి కుడిపైట వేసుకున్న ఒకావిడ.

''ఏటి, ఆ ఎములోడి పిలుపొచ్చీడానికెంత సేపు కావాలేటి!'' అంటున్నారెవరో.

రామారావు పిల్లల భుజాల మీద చేతులేసి నడవలేక నడిచొచ్చి తమ్ముడి పక్కన గోడకి చేరబడిపోయేడు. ఆ మొహంలో నమ్మలేని నిజాన్నేదో చూస్తున్న షాక్.

ఫోన్లందుకుని చుట్టాలు పక్కాలు అంతా వచ్చారు. జరగాల్సిన కార్యక్రమమంతా జరిపించి వెళ్లేరు. మూడోరోజు సాయంకాలానికి రమ, పిల్లలు, రామారావు, భారతి మిగిలేరు.

ఆ మూడు రోజులూ రమ పచ్చి మంచినీళ్లైనా తాగకుండా అలాగే పడివుంది.

ఆ రాత్రి భారతి, దగ్గర కూర్చుని రమకి హితబోధ చేసింది, 'పోయిన వాళ్లతో మనమూ పోలేం కదా!

చదువుల్లో ఉన్న పిల్లలు, వాళ్లకిక తల్లైనా తండ్రైనా నువ్వే. వాళ్లకి ధైర్యం చెప్పవలసింది పోయి నువ్వే ఇలా ఉంటే వాళ్లనెవరాదుకుంటారు చెప్పు'' అంటూ.

ఏమనుకుందో, మర్నాడు లేచి మొహం కడుక్కుని కాఫీ తాగింది రమ.

ఎవరో ఒకళ్లు పలకరించడానికి రావడం, వాళ్ల ముందు రమ తప్పు చేసిందానిలా తలవేళ్లాడేసుకుని కూర్చోవడం, ఉండుండి పిల్లలు వెక్కివెక్కి ఏడవడం, రామారావు ఒంటరిగా కూర్చుని కళ్లలో ఊరుతున్న నీళ్లని పదేపదే ఒత్తుకోవడం-మనసంతా కలచినట్లైపోతోంది భారతికి.

ఒకేచోట ఉద్యోగాల వలనో ఏమో ఒక్క ప్రాణంగా ఉండేవారు అన్నదమ్ములిద్దరూ-

పదకొండో రోజు దినకర్మ చేయించే పంతులు గారి కోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. సిటీలో ఎవరూ దొరకలేదు. దొరికిన ఒకళ్లిద్దరికి ఆ రోజు తీరికలేదు. సాధారణంగా ఇలాంటి కర్మలు చేయించే వాళ్లు వేరుగా ఉంటారు.

సింహ చలంలో ఎవరైనా దొరుకుతారేమో చూడమంది రమ. సహజంగా ప్రవాసాంధ్రులకి మత కర్మల మీద నమ్మకాలెక్కువ. మన సంస్కృతిని ప్రతిబింబించే ఏకైక మార్గాలుగా భావిస్తూ పండగలు-పబ్బాలు, నోములు-వ్రతాలు తు.చ తప్పక ఆచరిస్తూ ఉండేవాళ్లు భిలాయ్‌లో. అందునా రమ ఈ విషయంలో మరో నాలుగాకులెక్కువ చదివింది. తనకి కొంచెం చాదస్తం ఎక్కువే.

రామారావు సింహాచలం వెళ్లి రోజంతా వెతికి వెతికి ఓ పంతులుగార్ని పట్టుకొచ్చాడు. సంభావనలవీ ఘనంగా ముట్టచెప్తామని నమ్మబలికే వరకూ ఆయన కదిలి రాలేదు.

ఆయన ఆంగికం, పిలక అదీ చూసి రమ తృప్తిగా తలాడించింది. వాళ్లివ్వబోయిన కాఫీ ఆయన తీసుకోకపోయేసరికి రమకి ఆయన మీద పూర్తిగా నమ్మకం కుదిరిపోయింది.

ఆయన నేల మీద మఠం వేసుకు కూర్చుని కుడి చేతి బొటనవేలు చూపుడువేలూ కలిపిన ముద్రలో విషయాలన్నీ విడమరచి చెప్పడం మొదలు పెటేడు. గోదానం, భూదానం, సువర్ణదానం, వస్త్ర దానం, ధనధాన్య దానాల గురించి : ఆ దానాల ఫలితంగా మరణించిన జీవి ఆత్మ అడ్డంకులన్నీ దాటి ఎలా శాంతి లోకాలకి చేరుతుందో, అందునా వైతరణిని అతిక్రమించడానికి గోదానం ఎలా తోడ్పడుతుందో ఆయన పూసగుచ్చినట్టు వివరిస్తుంటే రమ తల ఊగిస్తూ వింటూ ఉంది.

''ఇప్పుడు గోవులూ భూములూ ఎక్కణ్నుంచొస్తాయిలెండి, వీటన్నింటికీ ప్రత్యామ్నాయం ఏదో ఉంటుందేమో కదండి'' అంది భారతి.

''ఉండకేం, ఉంది. ఒక్కొక్క దానికి ఇంత అని రేటు నిర్ణయించి, ఆ డబ్బు తాంబూలంలో పెట్టి ఆ దానం పేరు చెప్పి సమర్పించుకోవచ్చు.

కొందరేం చేస్తారంటేనూ గోదానం మాత్రం ప్రత్యక్షంగా చేస్తారు. భయానకమైన వైతరణిని గోవు తోక పట్టుకునే కదా అతిక్రమించాల్సి ఉంటుంది, అందుకని.'' అని విడమర్చి చెప్పేడాయన.

ఇంకాస్సేపు వేళ్లు మడిచి లెక్కలు వేసి కర్మదినాన్ని నిర్ధారించి చెప్పి ''ఇక సెలవు తీసుకుంటాను మరి, ఆ రోజు ఎన్నిగంటలకు తెములుతారో చెప్తే ఆ టైంకి వస్తాను'' అని కనుక్కుని వెళ్లేడు.

ఆ సాయంకాలం పొద్దు వాటారుతూండగా పంచెలు పైకి బిగించి కట్టి మాసిన బనీన్లతో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఇల్లు వెతుక్కుంటూ వచ్చేరు. సారాయి వాసన బైటికి రాకుండా పైమీది మాసిన తువాళ్లు నోటికి అడ్డం పెట్టుకుని జోగుతూ వాళ్లు చెప్పిందాని సారం ఏంటంటే-ఓ అయిదొందలిస్తే చాలు గోదానానికి వాళ్లు ఆవునీ దూడనీ సప్లై చేస్తారు. దాని తంతు ముగియగానే తిరిగి తోలుకుపోతారు.

''అయ్యో, అలాగైతే గోదానం ఇచ్చిన ఫలితం ఏం దక్కుతుంది?'' అంది రమ.

''లేదండమ్మా, కావాలంటే, ఒకర్నైనా అడిగి సూడండి. అందరూ సేసీదదేనండి. పంతులుగారికి మీరు తాంబూలంలో దచ్చిణం ఏత్తారు సూడండి, దానికీ దీనికీ సరండి''

రమ మొహం అసంతృప్తిగా పెట్టింది.

''అవుననుకుంటాను రమా, పంతులుగారు కూడా నాతో ఆ మాటే అన్నాడు'' అన్నాడు రామారావు.

''అది కాదండి, పంతులుగారికి దానంగా ఇచ్చిన ఆవునీ దూడనీ ఆయనింటికి తోలుకెళ్తేనే కదా మనకి ఫలం దక్కేది'' అంది రమ.

'రేపు ఉదయం మాట్లాడదాం రమ్మ'ని పంపించేసాడు రామారావు వాళ్లని.

అప్పన్న, చిన్నయ్య అని తమ పేర్లు, చెప్పి, ఇంకెవర్నీ పిలవొద్దని బతిమలాడి వెళ్లేరు.

రమ ఈ దానాల విషయంలో చాలా పట్టుదలగా ఉందని అర్థమైపోయింది. ''ఆయనేం అనుభవించేరు? ఉన్నంతకాలం మా కోసమే కదా శ్రమపడ్డారు. ఇప్పుడాయన కోసం ఈ మాత్రం చెయ్యకపోతే...''అని భోరుమని ఏడ్చేసింది రమ ఆ రాత్రి.

తను చాలా సెన్సిటివ్‌గా ఉందని, ఇక తన మాటకి ఎవరూ ఎదురు చెప్పొద్దని అనుకున్నారు మిగిలిన వాళ్లు.

'ఇంటికి మూలాధారం, తనతో జీవితాన్ని పంచుకున్న సహచరుడు హఠాత్తుగా మరణిస్తే తాను నమ్ముతున్న సిద్ధాంతం వాస్తవమా కాదా అని ఎవరూ ఆలోచించలేరేమో' అనుకున్నాడు రామారావు. మర్నాడు ఉదయాన్నే అప్పన్న , చిన్నయ్య వచ్చారు.

'ఆవూ దూడా మీ కెందుకండమ్మా, అయిదొందలిచ్చేసి, దానవిచ్చేసి, మల్లీ మాయావూ దూడా మాకిచ్చియ్యండి'' అన్నారు వాళ్లు.

''అదంతా మీకు అనవసరం, అమ్మితే అమ్మండి, లేకపోతే పొండి'' కసురుకుంది రమ.

వాళ్లిద్దరూ పక్కకెళ్లి ఏదో మాట్లాడుకుని వచ్చేరు.

''సరే నండి, అమ్మేత్తాం, అయిదువేలవుతాది''

''ఏంటీ అయిదువేలే?'' అన్నాడు రామారావు.

''మా మాట అపద్దవయ్యామాట్టైతే బజార్లో ఎక్కడైనా ఆవుల రేటెలాగుందో కనుక్కోండి, ఆవుతో బాటు దూడకూడా కదండి, అయిదు వేలేటండి, పదేలు, పాతికేలు కూడా ఉంటాయండి జాతావులు'' ''అలాక్కాదు, కొంచెం తగ్గించి చెప్పవయ్యా, సందర్భం ఏంటో మీకు తెల్సుకదా, ఇలాంటప్పుడు మీరిలా మాట్లాడితే ఎలాగ?...'' రమ మొహం చూసి రామారావు మాట పూర్తి చెయ్యలేదు.

''సరేనయ్యా, రేపు తోలుకొచ్చి కట్టెయ్యండి'' అంది రమ.

''రేపుణ్ణించీ ఎందుకండి, ఆయేల పొద్దున్నే తెచ్చి అప్పగించీ పూసీ మాది'' అన్నారు వాళ్లు.

''ఏదన్నా బజానా ఇప్పిత్తే..''

అని వాళ్లు చేతులు నలుపు కోవడం చూసి రమ ఎంత తెచ్చి ఇచ్చేస్తుందోనని రామారావు కంగారుగా జేబులోంచి యాభై నోటు తీసిచ్చేడు.

''చుట్టుపక్కల ఎవర్నైనా ఎంక్వైరీ చెయ్యాల్సిందేమో రమా,

అయిదువేలంటే ఎక్కువేమో'' అంది భారతి.

''ఎక్కువో తక్కువో కానీ అక్కా, ఆయనకి చివరి సారిగా చేసే ఈ కార్యక్రమం ఘనంగా జరిగిపోవాలి'' అంది రమ.

***

పదకొండోరోజు ఉదయాన్నే పంతులు గారొచ్చేడు.


ఇంటిపేర్లవాళ్లంతా తలస్నానాలు, శుద్ధి కార్యక్రమాలు చేసి సిద్ధంగా ఉన్నారు.

కర్మ చెయ్యాల్సిన బాబిగాడు క్షురకర్మ చేయించుకున్నాడు.

పూజా కార్యక్రమం ప్రారంభమై ఏడు తరాల పితృదేవతలకి తర్పణాలు సమర్పించడం పూర్తైంది.

ఖరీదైన పొందూరు పంచెల చాపులు పంతులు

కవిత



## తలుచుకో

(గజల్)

*గాయాలు పెరిగాయని పారిపోకు*
*వెదురు వేణువైన వైనం తలుచుకో!*
*అంతా రాళ్ళేనని మళ్ళిపోకు*
*శిల శిల్పమైన తీరు తలచుకో!*
*విమర్శల శరాలని విసిగిపోకు*
*పూలు, రాళ్ళని స్వీకరించిన రహదారిని తలుచుకో!*
*చీకటి రాత్రని చెదరిపోకు*
*నక్షత్రాల స్వప్నాలని తలుచుకో!*
*మార్పులేదని కలంగి పోకు*
*విత్తు వృక్షంగా మారిన దృశ్యాన్ని తలుచుకో!*
*జీవితానికి అర్థమేమిటని అదిరిపోకు!*
*తొలి కిరణానికి విరిసిన 'గులాబి'ని తలుచుకో!*

-ఎం.వీరేశ్వరరావు

గారికిచ్చేరు. సువర్ణదానం అని పంతులుగారన్నప్పుడు రాఘవ ఎంతో ఇష్టంగా పెట్టుకున్న వెంకటేశ్వరస్వామి ఉంగరం-తులం తూకంది తెచ్చి తాంబూలంలో పెట్టేసింది రమ.

చుట్టాలందరూ ఆశ్చర్యపోయి చెవులు కొరుక్కున్నారు.

ఆత్మలున్నాయని రమ ఇంతగా నమ్ముతోందా, లేక రాఘవ హఠాత్తుగా పోయిన షాక్‌లో ఇలా ప్రవర్తిస్తోందో అర్థం కాలేదు భారతికి. వెనక పెద్దలిచ్చిన ఆస్తిపాస్తులు, తరగని అయివేజులు ఉన్న వాళ్లు కాదు, ఇద్దరు పిల్లల చదువులు, వాళ్ల పెళ్లిళ్లు- ఎంతెంత బాధ్యతలున్నాయి! రమ సహజంగానే పొదుపరి. ఇప్పుడెందుకిలా ప్రవర్తిస్తోందో అర్థం కావడం లేదు.

ఇక గోదాన కార్యక్రమం ప్రారంభమౌతుందనగా బక్కచిక్కి, ఎప్పట్నుంచో ఎండగట్టినట్టున్న ఆవుని, దూడని తోలుకొచ్చేరు అప్పన్న చిన్నయ్య. వాటికి కట్టి తెచ్చిన కొత్త కన్నితాళ్ల డబ్బులు కూడా లెక్క చెప్పిపుచ్చుకున్నారు.

బాబిగాడి చేత గోదానం ఇప్పించేరు.

''పంతులుగారూ! ఈ ఆవుని, దూడని, తమరు స్వీకరించాలి'' అంది రమ.

ఒక్కసారిగా ఉలిక్కి పడ్డట్టయ్యాడు పంతులుగారు. ఈ మధ్యకాలంలో నిజంగా గోవునిస్తున్నవాళ్లెవరు? ఆయన మొహంలో ఆనందం దాచుకోవాలనుకున్నా దాగలేదు. కాని, ఈ పేరుతో ఇవ్వాల్సిన దక్షిణ ఇవ్వరేమో అని భయం వేసింది.

''తల్లీ, వీటిని తోలుకెళ్లి ఈ బస్తీలో నేనెక్కడ మేపగలను చెప్పండి.

అసలే పిల్లలు గలవాణ్ణి. బహుకుటుంబీకుణ్ణి అన్నాడాయన.

''అంటే వాటి మేత ఖర్చులు కూడా మమ్మల్నే ఇమ్మంటారా?'' అంది భారతి వ్యంగ్యంగా.

''మీరే చెప్పేరు కదా, సద్బ్రాహ్మణునికి గోవుని దానమిచ్చినప్పుడే మా వారి ఆత్మ వైతరణిని దాటగలుగుతుందని, డబ్బు దక్షిణల రూపంలో ఇస్తూనే ఉన్నాను కదా! ఎలాగైనా మీరీ ఆవును మాత్రం తీసుకోవాల్సిందే'' అని ప్రాధేయపడింది రమ.

పంతులుగారు దానాలన్నీ స్వీకరించడం పూర్తైంది.

పుష్కలంగా స్వయంపాక సంబారాలన్నిట్నీ ఒక ఆటోలో ఎక్కించి దారి ఖర్చులు కూడా ఇచ్చి సాదరంగా సాగనంపేరు.

ఆవుని, దూడని ఆయన తోలుకెళ్లలేదు కాబట్టి ఎవరిచేతనైనా తోలిపెట్టమని చెప్పి వెళ్లేడు.

సాయంకాలానికి చుట్టాలంతా వెళ్లేరు.

భోజనాల ఖర్చుతో కలుపుకుని ఆ రోజు ఖర్చు తడిసిమోపెడైంది.

'దానమిచ్చిన ఆవుని అలా ఇంటి ముందు ఉంచుకోకూడదు' అని చుట్టుపక్కల ఇళ్ల వాళ్లంతా నస మొదలుపెట్టేరు.

కాస్త తీరికయ్యేక తట్టింది 'అయ్యో వీటిని అమ్మిన వాళ్లనే, తోలుకెళ్లి పంతులుగారికి అప్పగించెయ్యమనా'ల్సిందని. వాళ్లిద్దరూ మధ్యాహ్నం భోంచేసి వెళ్లడం అందరూ చూసారు, తర్వాత ఎటెళ్లేరో ఎవరికీ అంతుపట్టలేదు.

గడ్డికో దేనికో రాత్రంతా ఆవూ దూడా అరుస్తూనే ఉన్నాయి. మధ్యలో బాబిగాడు వీధి చివరికెళ్లి ఎవర్నో అడిగి సందెడు గడ్డి పరకలు తెచ్చి వెయ్యబోతే ఆవు బుసకొడుతూ కొమ్ము విసిరింది. వాడు హడలిపోయి సగం గడ్డి మురిక్కాలవలో వేసేసాడు.

మర్నాడు ఉదయాన్నే రామారావు, బాబిగాడు స్కూటరు మీద ఊరంతా తిరిగి ఎక్వైరీ చేసి అప్పన్నని, చిన్నయ్యని పట్టుకుని తీసుకువచ్చేరు. డబ్బులు పుష్కలంగా ఉండడం చేత వాళ్లు పొద్దున్నే మరింత తాగి జోగుతున్నారు. ఆవుని దూడని సింహాచలం తోలుకెళ్లి పంతులుగారింటికి అప్పగించడానికి అయిదొందలడిగేరు. ఎలాగో బతిమలాడి మూడొందలకి వొప్పించేరు.

ఆ స్థితిలో వాళ్లు సరిగా తోలుకెళ్లి అప్పగిస్తారో లేదోనని డౌటొచ్చింది రామారావుకి. స్కూటరు మీద వాళ్ల వెంటే ఆయనా వెళ్లేడు.

ఇంటికొచ్చిన గోవు మాలక్ష్మిని చూసి పంతులుగారి భార్య సంతోషించింది. పసుపు, బొట్టు పెట్టబోతే కొమ్ములు విసిరింది, పృష్ఠాన్ని తాకబోతే కాలు ఝాడించింది గోవు మాలక్ష్మి. దాంతో పంతులమ్మగారికి ఆ గోవు నచ్చలేదు. మొదటి రోజునే వాళ్లిద్దరికీ వైరం ఏర్పడి మిర్రి మిర్రి చూసుకున్నారు.

అది చూసి అప్పన్న, చిన్నయ్య ఇదే మంచి అదనని పంతులమ్మ గార్ని మెత్తబరచాలని ప్రయత్నించేరు.

''అమ్మగారూ! తవలాంటోరు ఇలాంటి గొడ్డుతో ఎలాగేగుతారండీ? ఇదసలే పోట్లగొడ్డు, కొమ్మిసిరిందంటే ఇంకంతేనండి, కూడా దూడుంది కదా, పాల్పుక్కలేవన్నా ఇత్తాదనుకుంటన్నారేమో! అబ్బే, అందుకూ పనికి రాదండి, మహా ఇత్తే సోలడు. అది కూడా పచ్చగడ్డి మోపు మోపు తినేసి, ఇంకా తవుడు, చిట్టు లాంటియ్యంటే తెమ్మంటాదండి. మన్లోమనమాట మనవెక్కడ కొని మేపగలవండి ఇసుమంటి గొడ్డుని? మాలాటోళ్లం ఈటిని బజార్లో వొదిలీసి, అవసరానికి తోలుకొచ్చుకుంటంటావండి. ఏదో అలాగే బతుకుతెరువు, మా పొట్టలు గట్టానికి. మేవంటూరా, ఎవళు గోదానం ఇవ్వాలనుకున్నా అక్కడి కీటిని తోలుకెలిపోయి ఆ కూసేపూ ఆ యవ్వారం అయ్యీదాకా కాపెట్టుకుని ఆరిచ్చీ తుణవోపణవో తెచ్చుకుని ఏదో అలాగ కాలచ్చేపం సేస్తన్నావండి, కాబట్టి తవరు ఈటిని మాకిచ్చేత్తే. .

అమ్మమ్మా... ఉత్తినే కాదండి, ఏదో ఒక రేటు కాడికి ఈటిని మా కమ్మేత్తే మీకూ బాగుంటాది మాకూ బాగుంటాది'' అంటూ ఒక తీర్మానం చేశాడు అప్పన్న.

''మా యప్పన్న దరమం మాటాడేడండి. తవలాంటి బేపనోరికాడ కాన్డబ్బుకూడా ఉత్తినే ఉచ్చుకోకూడదండి. కానండమ్మా, నాల్రోజులోత్తే ఈటిని తవరే ఉత్తినే ఎవలకొకలికి తోలిపెట్టేత్తారండి, అప్పుడీటిని తోలుకెల్లీవోళ్లు కూడా ఎవలూ దొరకరండి తవకి'' అన్నాడు చిన్నయ్య

పంతులమ్మగారు కాస్సేపు ఆలోచించి ''ఎంతకి కొంటారేవిటయ్యా వీటిని?'' అంది

''ఎంతండి, ఈటి అసల్రేటు అయిదొందలు. ఏదో తవరు పెద్ద మనసు సేసుకోని రెండొందలో వందో తగ్గించి ఇచ్చేత్తే మీ పేరు సెప్పుకుని బతుకుతావండి, మీరు సరే అంటే ఉప్పుడే లెక్క సిద్ధంగా ఉందండి'' అని జేబులోంచి డబ్బులు తీసేడు అప్పన్న.

ఇందులో ఏదో మతలబు ఉందేమో అన్పించి, పంతులుగార్ని అడిగి చెప్తానంది పంతులమ్మగారు.

ఆయనొచ్చేవరకు వీళ్లు కాచుకుని కూర్చున్నారు.

''రమమ్మగారు మీకూ అయిదే వేలివ్వడం నేను కళ్లారా చూసేను. ఆ అయిదువేలు ఇచ్చి తోలుకుపోండి'' అన్నాడు పంతులుగారు.

''అదేటండి, ఎప్పుడు బేరం అప్పుడుదే, నిన్నటి రేటు ఇయాలుంటాదా, ఇయాల్టికరీదు రేపుంటాదా?'' అన్నారు వాళ్లు.

వీళ్లు అయిదొందలకి పైకెళ్ళలేదు- ఆయన అయిదు వేలకి కిందికి దిగలేదు.

''సరే బావూ, తవరెలా మేపుతారో మేవూ సూత్తాంగదా'' అని ఓ సవాలు విసిరి వెళ్లి పోయేరు



## అసిన్ హాలీవుడ్ సినిమా?

బాలీవుడ్‌లో ఒక వెలుగు వెలుగుదామన్న ఆశతో దక్షిణాదిని కాదనుకుని వెళ్ళిన తార అసిన్‌కు ఇప్పుడు లోకజ్ఞానం తెలిసొచ్చింది. అందుకేనేమో ఓ అడుగు వెనక్కేసి విజయ్ సరసన ఓ తమిళ సినిమాలో నటించింది. తెలుగులోనూ అగ్ర హీరో నటించే ఓ సినిమా కోసం ఆమెతో సంప్రదింపులు జరుగుతున్నట్టు సమాచారం. ఇవన్నీ ఓ ఎత్తయితే తాజాగా అసిన్ గురించి మరో అంశం వార్తల్లోకి వచ్చింది. వాల్ట్ డిస్నీ రూపొందిస్తున్న ఓ ఆంగ్ల చిత్రంలో నటించడానికి ఈమెను సంప్రదించారట. గతంలోనూ ఈమె నటించాల్సిన 'నైన్టీన్త్ స్టెప్' సినిమా పూర్తి కాలేదు. తాజా చిత్రం గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వాళ్లు.

కాలం క్రమంగా గాయాల పచ్చిని మాన్పింది. రమ, పిల్లలు ఎవరి దినచర్యల్లో వాళ్లు పడ్డాక రామారావు, భారతి ఇంటికి తిరిగొచ్చేరు. ఆవుతో పంతులుగారికి పాట్లెక్కువయ్యేయి. ఆయన చీటికీ మాటికీ రామారావు దగ్గరకొచ్చి తనపాట్లు చెప్పు కుంటున్నాడు.

ఓ రోజు వాళ్లింట్లో సంబారాలు నిండుకున్నా యని, బాబిగాడు ఫోన్ చేస్తే రామారావు వాణ్ణి తీసుకుని జగదాంబ సెంటరు మార్కెట్టు క్కెళ్లేడు. అక్కడ కూరగాయలమ్ముకునే ఒక ఆడమనిషి అప్ప న్నని, చిన్నయ్యని నిలబెట్టి బూతులు తిడుతోంది.

''దొంగమొకవోళ్లారా, నాయీావుని దూడని మీరుగాక ఇంకెవ్రలా తోలుకుపోతారు? అది మీకే అలబాటైంది. ఇంకెవల్నన్నా మీద సెయ్యెయ్యని త్తాదా? ఏదో తోలుకెళ్లినప్పుడల్లా యాభై రూపాయ లిత్తన్నార్లే అని వొల్లకుంటే ఉప్పుడే కసాయోల్లకో అమ్మేసి ఏవెరగని నంగనాసోల్లాగ మీకు తెల్దని కవుర్లు సెప్తున్నార్రా!

వారం రోజుల్నించి మీ ఏసికాలన్నీ సూత్తానే ఉన్నాను. మీ వొటేలు తిళ్లూ, ఇరవైనాలుగ్గంటలూ తాగుళ్లు.. ఇన్ని డబ్బులెక్కణ్నించొచ్చేయిరా దొంగ నాబేపిల్లారా? మీ మీద కేసెట్టి మిమ్మల్ని పోలీసో ల్లకి అప్పగించీపోతే నా పేరు కనకమాలచ్మేకాదు'' అంటోంది.

'అదన్నమాట సంగతి!' అనుకున్నాడు రామా రావు.

'వాళ్లలా తాగి తగలేసిన అయిదువేలతో ఎంత మంది పేదలకి, నిస్సహాయులకి కడుపులు నింపగ లిగి ఉండేవాళ్లం! అని కూడా అనుకున్నాడు.

కనకమాలక్ష్మి గొడవతో అప్పన్న, చిన్నయ్య పంతులుగార్ని పరిపరి విధాలుగా బ్లాక్ మెయిల్ చెయ్యడం, బెదిరించడం మొదలు పెట్టేరు.

పంతులుగారు ఎలాగో ధైర్యంగా నిలబడాలను కుంటే ఆవేమో ముందు కెళ్తే పొడుస్తుంది, వెనక్కెళ్తే తంతుంది. దూడేమో ఆవిచ్చే సోలెడు పాలు తాగేసి అవి అరిగిపోయేదాకా ఆపకుండా అంబా అంబా అని అరుస్తూనే ఉంటుంది.

ఈ పరిస్థితుల్లో పులిమీద పుట్రలా ఇంకో సంఘ టన జరిగింది–

''కట్టేసి ఉంటే అంతే, బైటికి తోలుకెళ్లి మేపుకుని రమ్మ''ని సలహా ఇచ్చేరెవరో.

ఓ రోజు బడికి సెలవు పెట్టి పంతులుగారి కొడుకు పన్నెండేళ్ళవాడు తోలుకెళ్లేడు ఆవుని, దూడని. పిల్లలాడుకునే గ్రౌండులో వదిలి, దగ్గర్లో మామిడి చెట్టుకింది కూర్చున్నాడు.

దూడ గెంతుతూ గెంతుతూ దూరం వెళ్లగానే దాని వెనక ఆవు పరుగెత్తింది.

కంగారులో కుర్రాడు 'పట్టుకోండి పట్టుకోండి' అని అరిచేడు.

అది విని అటుగా వస్తున్న శ్యామల్రావు మాస్టారు ఆవు తాడుని పట్టుకోబోయాడు. ఆదా యన డొక్కలో ఒక్కపోటు పొడిచి పరుగెత్తింది. అదో పెద్ద గొడవైంది.

మాస్టార్ని వైద్యం కోసం హాస్పిటల్లో చేర్పించి స్కూలు కుర్రాళ్లంతా పంతులుగారింటి మీదికి దండెత్తి వచ్చారు.

వాళ్ల కళ్ల పడకుండా తప్పించుకుని ఆయన పాహి ప్రభో అంటూ దగ్గర్లోనే ఉన్న రామారావు ఇంటికొచ్చి వాలిపోయేడు.

రామారావుకి ఏం చెయ్యాలో ఏం చెప్పాలో ఏమీ పాలుపోలేదు.

ఆ సాయంకాలం ఆవునీ, దూడనీ తెచ్చి రామా రావు ఇంటిముందున్న చెట్టుకి కట్టేసి ''అయ్యా, వీటిని వెనక్కి తీసుకుని నా దక్షిణ నాకిప్పిస్తే నన్ను రక్షించిన వారౌతారు'' అని మొరపెట్టుకున్నాడు పంతులుగారు.

రమకి ఫోన్ చేద్దామా అంటే ''తన బాధల్లో తనుంది, వద్దు'' అంది భారతి.

ఇక రామారావు ఓ నిర్ణయానికొచ్చేడు.

''సరే పంతులుగారూ, మీ దక్షిణ ఎంతో చెప్పండి''

''అయ్యా, ఆ ఆవు దూడల్ని తమరే కదా అయి దువేలిచ్చి కొన్నారు...''

''అదంతా వద్దు, గోదానానికి బదులుగా మీరెంత తీసుకుంటారో చెప్పండి''

''అయిదు వందలండి''

రామారావు అయిదొందలిచ్చి పంతులుగార్ని పంపించేసి, వెంటనే జగదాంబ మార్కెట్టుకెళ్ళాడు. అక్కడ కనకమాలక్ష్మికి ఆవిడ ఆవు దూడ ఎక్కడు న్నాయో చెప్పేసి వచ్చేడు.

మర్నాడు తెల్లారేసరికి కనకమాలక్ష్మి వచ్చింది. వాటిని తోలుకుపోవడానికి.

''వాళ్లిద్దర్నీ పోలీసులకి పట్టించేవా?'' అడిగేడు రామారావు.

''బావూ, తాగుబోతెదవలు ఆళ్లిద్దరేటి పరాయో ల్లేటండి, ఒకడు నా మొగుడు, ఉంకొకడు తోడబుట్టి నోడు, కడుపు చించుకుంటే కాళ్లమీద పడతాది, తవరు దరమ ప్రెబువులు సల్లగుండాల అంత దూరవొచ్చి కవురు సెప్పేరు'' అంది.

***

గట్టుకింద శివాలయ మంటపంలో కార్తీకమాస సందర్భంగా పురాణ కాలక్షేపం జరుగుతోంది.

రోజూ వెళ్లి కాస్సేపు విని వద్దాం అంది భారతి. భారతికి సాయంగా వెళ్తున్నాడు రామారావు.

ఆ రోజు శాస్త్రులుగారు గరుడ పురాణం చెప్తు న్నాడు–

జీవి శరీరాన్ని విడిచి పెట్టేక రౌరవాది నరకాల్ని, భయానకమైన వైతరణిని ఎలా దాటాల్సివుం టుందో, అందుకోసం ఆ జీవి బంధువులు ఏయే దానాలు, కర్మలు చేయాల్సి ఉంటుందో వివరిస్తు న్నాడు. నరకంలో జీవిపడే వేదనలు వింటూంటే భయంతో రోమాలు నిక్కపొడుస్తున్నాయి. రామా రావు పక్కకి తిరిగి ఇబ్బందిగా కదులుతున్న భార తివైపు చూసాడు. ఆమె మొహంలో భయం తాండ విస్తోంది. చటుక్కున లేచి నిలబడి భారతి చెయ్యం దుకున్నాడు. ఎవరో తరుముతున్నట్టు స్కూటరు స్టాండు వరకు పరుగులాంటి నడక ఆపలేదు.

పురాణ ప్రవచనాలు విన్పించనంత దూరం వెళ్లేక వెనక నుంచి అనునయంగా భుజంమీద చెయ్యివేసి ''థేంక్స్'' అంది భారతి.

''భారతీ! మనిషి తనకి ధైర్యం కోసం, దన్ను కోసం సృష్టించుకున్న మతం, ఆ మతం కోసం సృష్టించబడిన ఆచారాలు వేల సంవత్సరాలుగా అలాగే నిలిచిపోవడం ఆశ్చర్యకరం. ఆత్మ అని మనం అనుకునేది నిజంగా ఉందో లేదో. ఉంటే... వ్యక్తి మరణించాక అది ఏమవుతుందో ఎవ్వరూ కనుక్కోలేదిప్పటికీ. ఎవరేం చెప్పినా అన్నీ ఊహాజ నితాలే. అలాగే, ఉన్నాయో లేవో తెలీని స్వర్గ నరకాల కోసం అమాయకులిలా ఈ బేరసారాల వ్యాపార ప్రపంచంలో పడి కశ్మలంలో ఈగల్లాగ కొట్టుకోవడం నిజంగా విచారించ దగిన విషయం...

కాలం ముందుకి నడుస్తూంటే మనం వెనక్కి నడవకూడదు కదా భారతీ!'' అన్నాడు రామా రావు.

*

రచయిత సెల్ నెం: 9866467062

